# టూ లేట్

భద్రం చేతిలో టెలిగ్రామ్ పెట్టి సంతకం తీసుకుని వెళ్ళిపోయాడు పోస్టుమేన్ నిర్వికారంగా.

ఆత్రంగా టెలిగ్రామ్ విప్పి చూశాడు భద్రం.

"ఫాదర్ సీరియస్. స్టార్ట్ ఇమీడియట్లీ - సత్యం"

వణుకూ, దడా, దుఃఖం, నీరసం అన్నీ ఒక్కసారే వచ్చి అతడ్ని వాటేసుకున్నాయి.

మంచంమీద కూలబడి బావురుమన్నాడు.

ఇంటి నలుమూలల్లో దారిద్ర్యం తిష్టవేసుక్కూర్చున్నా తననెంతో ప్రేమగా సాకి తల్లిలేని లోటు కన్పించకుండా పెంచిన నాన్న... తను చదువుకునెంతో వృద్ధిలోకి రావాలని రాత్రింబవళ్ళూ ఎండనక, వాననక పొలాల్లో పనిచేసి తననింతవాడ్ని చేసిన నాన్న... మూడేళ్లు నిరుద్యోగ రక్కసితో పోరాడి పోరాడి అలసి సొలసి ఎట్టికేలకో పెద్ద ఫ్యాక్టరీలో చిరుద్యోగం సంపాదించుకున్న తనని తలచి ఆనంద భాష్పాలు గాకపోయినా కన్నీళ్లు తుడుచుకొంటోన్న నాన్న...

ఇప్పుడు గాలిలో పెట్టిన దీపంలా వున్నాడు!

తమకోసం తమ ఉన్నతికోసం తన బ్రతుకుని హారతి కర్పూరం చేసుకున్న నాన్నకి తామేమీ చెయ్యకుండానే చిన్నపాటి ఆనందానుభూతిని పంచివ్వకుండానే బ్రతుకుబాట చివరికి చేరుకున్నాడు!

నిజంగా తామెంత దురదృష్టవంతులు!

ఎవరో వీపు చరిచినట్టు వులిక్కిపడి కూర్చున్నాడు.

తనిలా విలపిస్తూ కూర్చుంటే కడచూపు కూడా దక్కకపోవచ్చు. అప్పుడిహ తనకంటే దౌర్భాగ్యుడీ లోకంలోనే వుండడు!

కళ్ళు తుడుచుకోకుండానే లేచి గబగబా పర్సూ, ఫ్యాంటూ, పెట్టె అన్నీ వెతికాడు భద్రం. మొత్తం అంతా కలిసి నాలుగు రూపాయల ఇరవై రెండు పైసలుంది. ముచ్చెమటలకి

బట్టలు తడిసి ముద్దవుతోంటే బ్యాంకు పాస్‌బుక్కు తీసి చూశాడు. అందులో వున్న బేలన్స్ ఏడు రూపాయల ముప్పైఏడు పైసలు మాత్రమే. అదంతా తీసేసుకుంటే మొత్తం పదకొండు రూపాయల యాభై తొమ్మిది పైసలవుతుంది!

తన ఊరికి బస్సు చార్జి ఇరవై రెండు రూపాయలు. రైలుకైతే పదమూడు రూపాయల యాభై పైసలు.

అంటే రైలుకి వెళ్ళాలనుకున్నా సుమారు రెండ్రూపాయలు తక్కువవుతుంది. ఎలావోలా ఎవరికాళ్లో చేతులో పట్టుకుని ఆ రెండ్రూపాయలూ సంపాదిస్తే రాత్రి ట్రెయిన్‌కి వెళ్లొచ్చు. అంటే రేపు ఉదయానిగ్గాని ఇంటికెళ్ళలేడు.

అప్పటికి నాన్న పరిస్థితెలా వుంటుందో!

కడచూపుకైనా నోచుకుంటాడా?

డబ్బు సమకూడి ఇప్పుడే బస్సులో బయల్దేరితే ఎలావోలా సాయంత్రానికెళ్ళిపోవచ్చు.

కానిప్పుడెలా? ఎవరిస్తారు అప్పు?

తనకీ వూళ్లో బాగా తెలిసినవాళ్ళెవరూ లేరనే చెప్పాలి - ఆఫీసు వాళ్లు తప్ప. వాళ్ళెవరి ఇళ్ళూ తనకి తెలీవు. ఎలావోలా తెలుసుకున్నా ప్రయోజనం వుండకపోవచ్చు. వాళ్ళూ తనలా పైసా పైసా లెక్క చూసుకునే జీతగాళ్ళే!

అవాళ శనివారమనీ బ్యాంకు పన్నెండు గంటలవరకే వుంటుందనీ గుర్తొచ్చింది భద్రానికి. గబగబా ప్రక్కరూంలో కెళ్ళి టైమడిగాడు.

పద కొండూ పది.

అతి వేగంగా బట్టలు తొడుక్కుని పాస్‌బుక్ తీసుకుని బ్యాంకుకి పరుగెత్తాడు.

ప్రతి శనివారంలానే అవాళా బ్యాంకు చాలా రష్‌గావుంది. ప్రతి కౌంటర్ దగ్గరా జనం గుంపులే. వుద్యోగులు చకచకా పని చేస్తున్నా జనం పలచబడటంలేదు. వెళ్ళేవాళ్లు వెళ్తోంటే వచ్చేవాళ్ళు వస్తున్నారు.

తిన్నగా సేవింగ్స్ బ్యాంక్ కౌంటర్ దగ్గరికెళ్ళి కాస్త ఖాళీ అవ్వగానే అక్కడున్న క్లర్క్‌ని విష్ చేసి పాస్‌బుక్ అందిచ్చాడు.

"విత్‌డ్రా చేస్తారా?"

జీతం రాగానే ఇంటి అద్దె వగైరాలు పోను మిగిలిన చిన్న మొత్తాన్ని బ్యాంకులో వేసుకుని అయిదూ పదీ చొప్పున తీసుకుంటూ ముప్పై రోజుల్నీ ఈడుస్తూంటాడు భద్రం. అందుకే అతడ్ని చూడగానే అలా అడిగేశాడతడు.

తలూపి కొంచెం ఇదిగా ఫీలవుతూ "ఇందులోవున్నదంతా కావాలండీ" అన్నాడు.

"అంతా కావాల్నంటే ఎక్కౌంట్ క్లోజ్ చెయ్యాలి"

"చేస్తానండి"

"ఏం? మీకేమైనా ట్రాన్స్‌ఫర్ వచ్చిందా?"

అవునంటూ తలూపాడు.

అతడో తెల్లకాగితం ఇచ్చి "ఎక్కౌంట్ క్లోజ్ చేసెయ్యమని మేనేజర్‌కి ఎడ్రస్ చేస్తూ లెటర్‌రాసి ఎక్కౌంటెంట్ గారికి చూపించిరండి" అన్నాడు.

రెండు ముక్కలు రాసి ఎక్కౌంటెంట్ దగ్గరికెళ్ళి తనకి ట్రాన్స్‌ఫర్ అయినట్టో అబద్ధం ఆడేసి లెటర్ చూపించాడు. ఆయన 'యస్' అని రాసి సంతకం పెట్టగా అది తెచ్చి క్లర్క్‌కిచ్చాడు.

పే ఆర్డర్ స్లిప్ ఇచ్చి పూర్తి చెయ్యమన్నాడతడు.

దాన్ని పూర్తిచేసి అంకె వేసేప్పుడు మాత్రం ఏడుకీ ముప్పై ఏడుకీ మధ్య గీతగియ్యడానికి నామోషీ అన్పించి చిన్న చుక్క మాత్రం పెట్టి వదిలేశాడు. చూసినవాళ్ళు పైసలుకూడా తీసేసుకుంటున్నాడని అన్పించకుండా అలా చేశాడు భద్రం.

టోకెన్ తీసుకునెళ్ళి సోఫాలో కూలబడ్డాడు – తండ్రి పరిస్థితి గురించీ తను వేగంగా ఇంటికెళ్ళే మార్గం గురించీ ఓ రెండ్రూపాయలు అర్జంటుగా చేబదులు సంపాదించడం గురించి ఆలోచిస్తూ....

"టోకెన్ నెంబర్ 32"

క్యాషియర్ పిలుపుకి వులిక్కిపడి లేచి చేతిలోని టోకెన్ నెంబర్నో సారి చూసుకు నెళ్ళి టోకెన్ ఇచ్చాడు భద్రం.

"ఏం ఇమ్మంటారు?" క్యాషియర్ అడిగాడు హడావిడిగా.

"మీ ఇష్టం"

అతడు ఏడు వందకాగితాలూ, మూడు పదులూ, ఒక అయిదూ, రెండు ఒక్కట్లూ ఇచ్చాడు.

అతడన్ని నోట్లు ఇచ్చేస్తోంటే అదిరిపడి చూశాడు. వణుకుతోన్న చేతుల్తో అందుకున్నాడు భద్రం.

క్యాషియర్ మరో నెంబరు పిలవడంతో నోట్లు లెక్క పెడుతూ రెండడుగు లేశాడు. క్యాషియర్ పొరబాటున ఏడురూపాయల ముప్ఫై ఏడు పైసలకి బదులు ఏడువందల ముప్ఫై ఏడు రూపాయలిచ్చాడనుకునే సరికి గాభరాగా అన్పించింది.

ఓ ప్రక్క ముచ్చెమటలు పోస్తోంటే మళ్ళీ మళ్ళీ లెక్కపెడుతూ పదడుగులేశాడు ద్వారం వైపు.

తనకిప్పుడు డబ్బు అత్యవసరం.

'వెంటనే బస్సులో మీ వూరెళ్ళి నీకోసం కళ్ళల్లో ఒత్తులు వేసుకుని చూస్తోన్న నీ తండ్రి కడసారి కోరిక తీర్చ'మంటూ భగవంతుడీ రూపంలో డబ్బిచ్చాడేమో అన్పించసాగింది భద్రానికి.

మరో ప్రక్కన ఇదన్యాయమంటూ మనస్సు గోలచెయ్యసాగింది.

ఏం చెయ్యాలి?

తిరిగివ్వటమా? మౌనంగా వెళ్ళిపోవటమా?

అవతల అవసరం!

ఇవతల నీతి!

రెండు క్షణాలు గుంజాటన పడ్డాడు.

ప్రాణాల మీదికొచ్చినా సరే అన్యాయపు సొమ్ము తనకి వద్దుగాక వద్దనుకుని వెనుదిరగాలను కున్నాడో లేదో-

"ఏమండోయ్ భద్రంగారూ" అంటూ క్యాషియర్ గావు కేక పెట్టాడు. అంతటితో వూరుకోక "అదిగో ఆ తెల్లషర్టతన్ని పట్టుకోండి. బాపురే... ఎక్సెస్ పేమెంటిచ్చేశాను" అన్నాడు గట్టిగా అరుస్తూ కలవరపడుతూ.

ఆ మాటలు వింటూనే బొమ్మలా అయిపోయాడు భద్రం. ఎవరో తన చెయ్యి పట్టుకోబోవడంతో మెల్లగా క్యాష్ కౌంటర్ దగ్గరకి నడిచాడు తలొంచుకుని.

డబ్బంతా ఇచ్చేశాడు మౌనంగా.

"ఏడు రూపాయల ముప్ఫైఏడు పైసలివ్వాల్సి ఏడువందల ముప్ఫై ఏడు రూపాయలిచ్చేస్తే తిరిగివ్వటం పోయి జేబులో పెట్టుకు నెళ్ళిపోవడమే మీ సొమ్మైపోయినట్లు? నా

కెంచేతో అనుమానం వచ్చి వెంటనే చూసుకోబట్టిగాని లేకపోతే 730 రూపాయలు నా జేబులోంచి పెట్టుకోవాల్సివచ్చేది. చదువుకున్న వాడివి ఇలా మోసం చేస్తే ఎలాగా?" క్యాషియర్ అరుస్తున్నాడు.

మిగతా జనం కూడా పైకి డాబుగా కన్పిస్తూ మోసాలు చేస్తున్నారంటూ వ్యాఖ్యానాలు విసుర్తున్నారు భద్రాన్నే గుర్రుగా చూస్తూ.

భద్రం తల మరింత వంగిపోయింది.

తనొక్కక్షణం ప్రలోభపడ్డా ఆఖరికి తిరిగిచ్చెయ్యాలనే అనుకున్నానని చెప్పాలనుకున్నాడు గాని నోరు పెగల్లేదు. ఎలాగూ.... చెప్పినా ఎవరూ నమ్మరనీ, పైపెచ్చు దొరికేసేడు గనుక ప్లేటు ఫిరాయిస్తున్నాడని నవ్వుతారనీ వూరుకుండి పోయాడు.

క్యాషియర్ తిట్లు జోడించి మరీ ఏదేదో అంటూ ఏడు రూపాయల ముప్ఫై ఏడు పైసల్ని విసిరేశాడు భద్రం మీదికి.

అవి తీసుకుని బ్యాంకులోని వారంతా తననో దొంగలా చూస్తోంటే తల సిగ్గుతో, అవమానంతో, దుఃఖంతో కృంగి పోతోంటే అతి కష్టం మీద కదిలాడు.

తనో రెండు క్షణాలు... నిజంగా రెండు క్షణాలే... వెనకా ముందాడినా ఆఖరికి డబ్బు తిరిగిచ్చేయ్యాలనే అనుకున్నాడు గాని అప్పటికే అరక్షణం... అవును అక్షరాలా అరక్షణమే ఆలస్యమయ్యింది.

ఒక్క అరక్షణం ముందే తను వెనుదిరిగి నట్లైతే అందరి దృష్టిలో మంచివాడుగా ముద్రపడేవాడు. పొగడబడేవాడు. కాని ఆ కాస్తలోనే సమయం మించిపోయేసరికి అందరి ముందూ దొంగలా, ద్రోహిలా నిలబడాల్సొచ్చింది.

తనెంత దురదృష్టవంతుడు!

టెలిగ్రామ్ చూసినప్పటికికన్నా ఎక్కువ దుఃఖం వెల్లువలా రాగా తలవంచుకుని కళ్ళు తుడుచుకోకుండానే బయటికి నడిచాడు తడబడ్తూ భద్రం!

**(భారతి మాసపత్రిక మార్చి 1984)**